పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


ఎయిర్‌లైన్స్ కాలనీలో పర్యటిస్తున్న డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

బేగంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం బేగంపేట డివిజన్‌లోని ఎయిర్‌లైన్స్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో చెత్త సక్రమంగా తీయడం లేదని, ఫుట్ పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయని, అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా పారిశుధ్య సిబ్బంది సక్రమంగా రాకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుందని ఆయనకు తెలిపారు. ఆ వెంటనే ఆయన శానిటేషన్ అధికారులతో మాట్లాడారు. చెత్తను రోజూ తీయాలని, లేకపోతే మరొకరికి ఆ పని అప్పగించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గోపాల్‌తో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో త్వరలో టీడీపీకి పూర్వ వైభవం


అరవింద్‌కుమార్‌తో ఖైరతాబాద్ నాయకులు

బంజారాహిల్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్‌గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీని నాయకులు వీడినప్పటికీ కింది స్థాయి కార్యకర్తలు ఇప్పటికి చురుగ్గా పనిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా నగరంలో పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు త్వరలోనే కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ పార్టీ నాయకులు నర్సింహులు, నల్లెల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నటుడు మాదాల రవి

డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : మాదాల రవి

బంజారాహిల్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సినీ నటుడు డాక్టర్ మాదాల రవి అన్నారు. ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే చెడు పరిణామాలపై ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం డ్రగ్స్‌ను నిర్మూలిద్దామంటూ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మాదాల రవి మాట్లాడుతూ మారుతున్న పాశ్చాత్య సంస్కృతికి యువత ప్రభావితమై డ్రగ్స్, గంజాయి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఫిలింనగర్ ఎస్‌ఐ అంజనమ్మ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి ఎవరైన వినియోగిస్తున్నట్టు తెలిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పీఎన్ఎం ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.మారన్న, సహాయ కార్యదర్శి కళ్యాణ్, నగర నాయకులు నాయుడు, భరత్ తదితరులు పాల్గొన్నారు.


దక్షిణ డిస్కంలో పదవీ విరమణ చేసిన జాయింట్ సెక్రటరీ చిన్నం ప్రభాకర్, ఓఅండ్ఎం ఎస్ఈ విజయ్‌కుమార్‌లను ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అభినందిస్తున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ
-హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

టెలిఫోన్ స్తంభానికి ఢీకొట్టి కారు బోల్తా

ఇద్దరు యువకులకు గాయాలు

బంజారాహిల్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాభ్యాసం కోసం నాలుగు రోజుల్లో ఆస్ట్రేలియా వెళ్లాలి.. ఈలోపే స్నేహితుడితో కలిసి పబ్‌లో మద్యం తాగి మత్తులో కారు నడిపి టెలిఫోన్ స్తంభానికి ఢీ కొట్టడంతో కారు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దాటాక వెంకటగిరి మలుపు వద్ద జరిగింది. పోలీసలు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లికి చెందిన నక్కల సాకేత్‌రెడ్డి బీసీఏ పూర్తి చేశాడు. ఉన్నత విద్య కోసం ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ నెల 30న కొంపల్లిలో ఉండే సాయిసిద్ధార్థతో కలిసి కారులో మాదాపూర్‌లోని సౌండ్స్ అండ్ స్పిరిట్స్ పబ్‌లో మద్యం తాగాడు. అర్ధరాత్రి తర్వాత స్నేహితుడిని కొంపల్లిలో దించి ఇంటికి వెళ్లేందుకు ఇద్దరు కారులో బయలు దేరారు. వెంకటగిరి రోడ్డు మలుపు తీసుకుంటుండగా వాహనం అదుపు తప్పి టెలిఫోన్ స్తంభానికి ఢీకొట్టడంతో బోల్తా పడింది. ఇద్దరూ కారులో ఇరుక్కుపోగా స్థానికులు వారిని బయటకు తీశారు. ఇద్దరికీ స్వల్పంగా గాయాలయ్యాయి. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల క్యాబ్‌లను అనుమతించొద్దు

శంషాబాద్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లకు అనుమతివ్వొద్దని డిమాండ్ చేస్తూ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్యాబ్‌డ్రైవర్లు చేపట్టిన ఆందోళన బుధవారం రెండోరోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా క్యాబ్ డ్రైవర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొందరు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి క్యాబ్‌లను తీసుకొచ్చి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నడిపించి తమ జీవనాధారాన్ని దెబ్బ తీస్తున్నారని, తాము రోడ్డున పడే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇంతకుముందు జీఎంఆర్ అధికారులుకు, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

యువతి బెదిరింపులతో వ్యక్తి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యువతి బెదిరింపులకు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికనగర్ ప్రాంతంలో నివాసం ఉండే కె.రాములు ఐదు ఏళ్లుగా బసవతారకం ఆసుపత్రిలో వైద్యుల వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఓ యువతితో తరచూ ఫోన్‌లు మాట్లాడుతున్నాడు. ఇది గమనించిన అతని భార్య స్వాతి ఫోన్ తీసుకుని గట్టిగా అడగడంతో సమాధానం చెప్పకుండా తప్పించుకున్నాడు. గత సోమవారం సాయంత్రం ఆ యువతి ఫోన్‌లో వీడియో పెట్టి వెంటనే రాకపోతే చనిపోతా అంటూ మెసేజ్ పెట్టింది. ఆ వీడియోను చూసిన భార్య స్వాతి మరోసారి నిలదీయగా కొంత కాలంగా ఆమెతో పరిచయం ఉందని, ప్రస్తుతం దూరంగా ఉంటున్నానని, భయంగా ఉందని తెలిపాడు. దీంతో భార్య ఏమీ కాదులే అంటూ సమదాయించింది. ఈ నెల 30వతేదీ రాములు స్నానానికి వెళ్లి వాంతులు చేసుకుని పడిపోయాడు. భార్య పరిశీలించగా బాత్‌రూమ్‌లోని యాసిడ్ బాటిల్ ఖాళీగా ఉంది. దీంతో వెంటనే ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో ఆ యువతి వీడియోలు పంపి బెదిరించడంతోనే తన భర్త మానసిక వేదనతో ఆత్మహత్య చేసుకున్నాడని, ఆమెపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పోలీసులకు అతని భార్య స్వాతి ఫిర్యాదు చేసింది.

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

- క్యాపిటల్ సెక్యూరిటీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి
- నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డుల ఆందోళన


ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులు

సనత్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలు, పే స్లిప్పులు ఇవ్వాలని సెక్యూరిటీ గార్డులు బుధవారం విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ వారి దగ్గరికి వచ్చి డైరెక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భగా యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేష్ మాట్లాడుతూ నిమ్స్ ఆస్పత్రి సెక్యూరిటీ సర్వీసు నిర్వహించడానికి శ్రీ కార్తికేయ, క్యాపిటల్ రెండు సెక్యూరిటీ ఏజెన్సీలు ఉన్నాయన్నారు. ఈ రెండు ఏజెన్సీల కింద పనిచేస్తున్న గార్డులకు జీతాల్లో తేడాలున్నాయన్నారు. ఒకే దగ్గర పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు జీతాలు ఇచ్చే దగ్గర ఈ తేడాలు ఎందుకని ప్రశ్నించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు.

పండుగ సెలవులను ఇవ్వాలి

కాంట్రాక్టు కార్మికులకు నెలనెలా ఒకటో తేదీ నుంచి 5వ తేదీలోపు జీతాలు వస్తున్నాయని, అలాంటిది సెక్యూరిటీ గార్డులకు రెండు నెలల వేతనం రాకపోవడం అన్యాయమన్నారు. జీతాలు సమయానికి రాకపోవడం మూలంగా ఇటీవల జరిగిన బోనాల పండుగకు వారి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడ్డాయని అన్నారు. కిరాయి ఇళ్లలో ఉన్న వారిని కొంతమందిని ఇల్లు ఖాళీ చేయించారని అన్నారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్న సెక్యూరిటీ గార్డులను సమయానికి జీతం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న క్యాపిటల్ సెక్యూరిటీ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు ఏజెన్సీల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు 1వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని, చట్ట ప్రకారం ఈఎల్, సీఎల్, పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్యాపిటల్ సెక్యూరిటీ సంస్థ కింద పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు తక్కువగా ఇచ్చిన వేతనాన్ని ఏరియర్స్ రూపంలో వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిఫ్ట్‌లో వేడుకగా ఓరియంటేషన్ ప్రోగ్రామ్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభ సూచికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. కొత్త బ్యాచ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా ప్రారంభమైన ఈ వేడుకలో వెల్‌స్పన్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్, హెడ్-సౌత్ శ్రీసా భార్గవ మొవ్వ, నిఫ్ట్ హైదరాబాద్ పూర్వ విద్యార్థి, సుప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్ అర్చనారావు, టీ వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్లతో పాటుగా నిఫ్ట్ నుంచి పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (2024-28) కోసం 245 మంది, పోస్ట్ గ్రాడ్యుయేషన్ (2024-26) కోసం 35 మంది విద్యార్థులు చేరారని, వీరికి క్యాంపస్‌లో అందుబాటులోని సదుపాయాలు, ఉండాల్సిన విధానం తదితర అంశాలను తెలియజేస్తామని నిఫ్ట్ డైరెక్టర్ వెల్లడించారు. ఓరియేంటేషన్ కార్యక్రమంలో భాగంగా బీట్స్ ఆఫ్ జాజ్, స్కిట్ షో, లెదర్ షో, రంగ్ తరంగ్ వంటి కార్యక్రమాలు, పోటీలను సైతం నిర్వహిస్తున్నామని, నూతన విద్యార్థులు క్యాంపస్ వాతావరణానికి అలవాటు పడేందుకు ఇవి తోడ్పడతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.


బోనాల వేడుకల్లో కలెక్టరేట్ అధికారులు

కలెక్టరేట్‌లో ఘనంగా బోనాలు

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం చివరి వారాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కాగా, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి, ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాత్రికేయులు రాజకీయాల్లోకి రావాల్సిందే


అభివాదం చేస్తున్న బీఎస్ రాములు, నర్సింహులు, పలు సంఘాల నాయకులు

పంజాగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అవినీతి, నేరరహిత సమాజం కోసం నిరంతరం కష్టపడే పాత్రికేయులు నేరుగా రాజకీయల్లోకి రావలసిన ఆవశ్యకత ఏర్పడిందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్(ఏడబ్ల్యూజేఏ), తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పాత్రికేయుల రాజకీయ పార్టీ ఆవిర్భావం జరిగింది. ఇక్కడ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జీరో బేస్డ్ బడ్జెట్ పాలిటిక్స్, నవ సమాజ స్థాపన, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, నిరుద్యోగ యువత భవిష్యత్, అవినీతి-నేరరహిత, నిస్వార్థ సమాజ నిర్మాణం, తదితర అంశాలపై వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా పాత్రికేయులు రాజకీయల్లోకి రావలసిందేనని అన్నారు. అనంతరం ప్రజలు తమ అభిప్రాయాలను పంపడానికి ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌ను జైళ్ల శాఖ రిటైర్డ్ ఐజీ నర్సింహులు, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు ప్రారంభించారు. హక్కుల పరిరక్షణకు, ప్రజల సంరక్షణకు, సమాజ హితం కోసం పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందని ఏడబ్ల్యూజేఏ జాతీయ అధ్యక్షుడు కె.కోటేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వరావులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కెమెరాల చోరీ.. అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఫొటో షూట్ కోసం కెమెరా అద్దెకు కావాలని చెప్పి, చోరీ చేసిన నిందితుడిని మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరు ఉత్తనహళ్లికి చెందిన చలపతి(41) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో కెమెరాలు చోరీ చేసి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం కేఎస్ మనోజ్ కుమార్ పేరుతో నకిలీ ఆధార్‌ను తయారు చేశాడు. ఈనెల 24న నగరానికి వచ్చాడు. నకిలీ పత్రాలు చూపి నాంపల్లిలోని లాడ్జిలో బస చేశాడు. యూసఫ్‌గూడలోని యునిక్ కెమెరా రెంటల్స్ నిర్వాహకుడు దత్తాత్రిని సంప్రదించాడు. ఫొటో షూట్ కోసం ఖరీదైనా సోని ఏ7ఎస్3 కెమెరా, లెన్స్‌లు, కెమెరామెన్ కావాలని కోరాడు. రోజుకు రూ.9 వేలు అద్దె చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకొని, ఇతరుల ఖాతాద్వారా రూ.3 వేలు చెల్లించాడు. 25న కారు బుక్ చేసి, దత్తాత్రి పంపిన కెమెరామెన్ రాకేశ్‌ను నగరంలో పలు ప్రాంతాలకు తిప్పి ఫొటోలు తీయించాడు. చివరికి సాలార్‌జంగ్ మ్యూజియంలో ఫొటోలు తీయమని చెప్పి, కారులో ఉన్న కెమెరాతో బెంగళూరుకు వెళ్లిపోయాడు. కెమెరాతోపాటు నిందితుడు కనిపించకపోవడంతో బాధితుడు మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కెమెరా చోరీ చేసిన చలపతి, ఆబిడ్స్‌లోని జగదీశ్ మార్కెట్‌లో కెమెరాను విక్రయించేందుకు 30న ఎంజీబీఎస్‌కు వచ్చాడు. అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేయగా కెమెరా చోరీ విషయం ఒప్పుకున్నాడు. దాంతో పోలీసులు చలపతిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.


మాట్లాడుతున్న ఈఎమ్మార్ ప్లాట్ల బాధితులు

మా ప్లాట్లు మాకు ఇప్పించాలి

ఖైరతాబాద్, జూలై31(ఆంధ్రజ్యోతి): వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న తమ ప్లాట్లను తమకు అప్పగించేలా ప్రభుత్వం చొరవ చూపాలని నానక్‌రాంగూడ ఈఎమ్మార్ బాధితులు డిమాండ్ చేశారు. బుధవారం ఖైరతాబాద్ వాసవీ కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాము ప్లాట్లు కొనుక్కొని దాదాపు 20 సంవత్సరాలుగా పోరాడుతున్నా న్యాయం జరగడంలేదన్నారు. తమ పేర్లపై రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లను బలవంతంగా లాక్కొన్నారని, ఈ విషయమై ఎన్నో పోరాటాలు చేశామని తెలిపారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమకు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపిన నేపథ్యంలో మా సమస్యకు ఆయన పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్లాట్ల యజమానులు డాక్టర్ కడియాల రాజేంద్ర, నఫీజా బేగం, రోషిని, మేజర్ ఘనశ్యాం పాండే, భీంసేన్‌రావు తదితతరులు పాల్గొన్నారు.

3 నుంచి హైదరాబాద్‌లో సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్



హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హిందుస్తానీ కళలు, సంస్కృతి, సాహిత్యాన్ని వేడుక చేసే అతి పెద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో ఒకటైన సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ మొదటిసారిగా హైదరాబాద్‌లో జరగనుంది. ఈ కార్యక్రమం ఆగస్టు 3, 4 తేదీల్లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)లో జరగనుంది. ఈ సాంస్కృతికోత్సవాల విశేషాల గురించి జష్న్-ఏ-ఆదాబ్ వ్యవస్థాపకుడు కున్వర్ రంజీత్ చౌహాన్ మాట్లాడుతూ 'పలు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం అద్భుత విజయం సాధించిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చింది. ఈ సాంస్కృతికోత్సవంలో దక్కనీ ఉర్దూపై పర్షియన్ ప్రభావంపై చర్చతో పాటుగా డాక్టర్ విద్యా షా గజల్స్, వార్సీ బ్రదర్స్ ఖవ్వాలి, యామినీరెడ్డి నృత్యప్రదర్శన, ఉర్దూలో శ్రీమద్ భగవద్గీత పఠనం వంటివి ఉంటాయి. దేశ వ్యాప్తంగా సుప్రసిద్ధ కవులు, గాయకులు, కళాకారులు పాల్గొననున్న ఈ కార్యక్రమంలో సాహిత్య, కళాభిమానులు పాల్గొనవచ్చు'అని తెలిపారు.

పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దండి


కృష్ణకాంత్ పార్కులో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పార్కులు పచ్చదనంతో ఆహ్లాదం పంచేలా ఉండాలని, కుటుంబంతో పార్కుకు వచ్చి సేదతీరేలా నిరంతరం పార్కులపై దృష్టి పెట్టి పర్యవేక్షించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని కృష్ణకాంత్ పార్కు, యూసుఫ్‌గూడ బస్తీ, బోరబండ, ఆర్‌కే కాలనీ, కల్యాణ్‌నగర్‌లలో అధికారులతో కలిసి పర్యటించారు. కృష్ణకాంత్ పార్కు ఎంతో చారిత్రకమైనదని, దాని ప్రత్యేకతను కాపాడుకుంటూ పచ్చదనం ఉట్టిపడేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్కులో ఎటువంటి చెత్త, గ్రీన్‌వేస్ట్ లేకుండా చూడటంతో పాటు చెట్లను నిరంతరం సంరక్షిస్తూ కొత్త మొక్కలు నాటాలని సూచించారు. వాకింగ్‌తో పాటు కుటుంబ సభ్యులు అందరూ వచ్చి ఆహ్లాదంగా గడిపేలా పార్కును తయారు చేయాలన్నారు. కాలనీలలో పారిశుధ్య పనులు అత్యంత పకడ్బందీగా చేపట్టాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ఎంటమాలజీ ఆధ్వర్యంలో తగు చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో యూసుఫ్‌గూడ డీఎంసీ సేవా ఇస్లావత్, అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ


ఉద్యోగులను సన్మానిస్తున్న డీన్ ప్రొ.లిజారాజశేఖర్

సనత్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను బుధవారం ఆస్పత్రిలోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్ డీన్ ప్రొ.లిజారాజశేఖర్ వారిని ఘనంగా సత్కరించి, వారు అందించిన సేవలని కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో రాంబాబు(ల్యాబ్ టెక్నీషియన్), రంగారెడ్డి(థియేటర్ అసిస్టెంట్), జయంతి (నర్సింగ్ ఆఫీసర్), సుగుణ మేరీ(నర్సింగ్ ఆఫీసర్), నీలా(నర్సింగ్ ఆఫీసర్), నర్సింగ్‌రావ ఉన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ డాక్టర్ శాంతివీర్ పలు ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని పదవీ విరమణ చేసిన వారిని ఘనంగా సన్మానించారు.

డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారమే


కమాలాసన్‌రెడ్డి, ఐపీఎస్

హైదరాబాద్ సిటీ/ఘట్‌కేసర్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారం అవుతుందని తల్లిదండ్రులు, పిల్లలు తెలుసుకోవాలని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. ఇటీవల మాదాపూర్ రేవ్‌పార్టీలో డ్రగ్స్ వినియోగిస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన నిందితులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. భవిష్యత్తులో డ్రగ్స్ మహమ్మారి జోలికి పిల్లలు వెళ్లకుండా చూస్తామని హామీ ఇస్తేనే విముక్తి కల్పిస్తామన్నారు. ఇక నుంచి పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటామని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు హామీ ఇచ్చారు. అబ్కారీ భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అడిషనల్ ఎస్పీ భాస్కర్‌గౌడ్, ఎస్ఎఫ్‌టీ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, డీఎస్పీ తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో ఘనంగా బోనాలు


పూజలు చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ఎర్రగడ్డ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల అవరణంలోని వింధ్యవాహిని మాత, శ్రీ కనకదుర్గా మాత అమ్మవారి ఆలయాల్లో బుధవారం బోనాలు పండుగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనం చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాశ్రీనివాస్, ఉద్యోగ సంఘం నాయకులు జగదీష్, ఏలూరి శ్రీనివాస్, డాక్టర్ ముజీబ్‌తో పాటు పలువురు ప్రొఫెసర్‌లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మ, ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు నిర్వహిస్తున్న నర్సింగరావు

బంజారాహిల్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ పరిధిలోని వినాయకనగర్‌లోని ఎలమ్మ, ఈదమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ 18 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, సంపంగి కిరణ్, వి.రాములు, ఎస్ దయానంద్, డి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ చోరీ కేసు విచారణ ముమ్మరం

జార్ఖండ్‌కు వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందాలు

పంజాగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో మొబైల్ ఫోన్ల దొంగతనాలకు సంబంధించి కేసు విచారణను పంజాగుట్ట పోలీసులు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఆరుగురు ముఠా సభ్యులను, వారికి సహకరించిన ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డును పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ముఠా నాయకుడు రాహుల్ కుమార్‌యాదవ్, మిగితా సభ్యుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందాలు జార్ఖండ్ కు వెళ్లినట్టు తెలిసింది. ఇప్పటికే ముఠా నాయకుడు రాహుల్ కుమార్ యాదవ్, సభ్యులు వారివారి ప్రాంతంల నుంచి పరారయ్యారని తెలిసింది. అరెస్టు అయి రిమాండ్ లో ఉన్న నిందితులను, కానిస్టేబుళ్లు, హోంగార్డును పోలీస్ కస్టడీకి తీసుకొని మరోసారి విచారించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన అవసరం

● నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాళ్

బోయినపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే డ్రగ్స్ వినియోగంపై జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని, ఈ క్రమంలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాఠశాలల ఉపాధ్యాయులదేనని నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాళ్ పేర్కొన్నారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెయింట్ ఆండ్రూస్ స్కూల్‌లో బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంపై జరిగే అనర్థాలపై సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీపీ రేష్మి పెరుమాళ్, బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ రేష్మి పెరుమాళ్ విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు మత్తుమందుకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మార్కెట్లలో దొరికే కొత్త రకం చాక్లెట్‌లు తినరాదని అన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు వాడుతున్నారని అనిపిస్తే పోలీసులకు లేదా పాఠశాల యాజమాన్యానికి తెలియజేయాలన్నారు. ప్రస్తుత రోజులలో విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారి మత్తులోపడి వారి జీవితాలను కోల్పోతున్నారన్నారు. ఇంటర్నెట్ గేమ్స్ పట్ల ఆసక్తి పెంచుకొని ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు డబ్బులను కోల్పోవడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తూ చెడు అలవాట్లకు గురికాకుండా ఇంట్లో కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మంచిమార్గంలో నడిచి మంచిగా చదువుకోవాలని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. మాదకద్రవ్యాలను పూర్తిగా నియంత్రించేందుకు రాష్ట్రం నలువైపులా పోలీసులు ఎక్సైజ్, నార్కొటిక్స్ బ్యూరో ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారని, అంతేకాకుండా అనుమానితులను గుర్తిస్తే సమాచారం అందించాలని అన్నారు. బంగారు భవిష్యత్తుని పాడుజేసుకోకుండా బాగా చదువుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రేష్మి పెరుమాళ్

డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారమే

● ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి
● రేవ్‌పార్టీ నిందితులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ/ఘట్‌కేసర్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారం అవుతుందని తల్లిదండ్రులు, పిల్లలు తెలుసుకోవాలని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. ఇటీవల మాదాపూర్ రేవ్‌పార్టీలో డ్రగ్స్ వినియోగిస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన నిందితులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. భవిష్యత్తులో డ్రగ్స్ మహమ్మారి జోలికి పిల్లలు వెళ్లకుండా చూస్తామని హామీ ఇస్తేనే విముక్తి కల్పిస్తామన్నారు. ఇక నుంచి పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటామని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు హామీ ఇచ్చారు. అబ్కారీ భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అడిషనల్ ఎస్పీ భాస్కర్‌గౌడ్, ఎస్‌ఓటీ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, డీఎస్పీ తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వి.బి.కమలాసన్‌రెడ్డి

మద్యం వినియోగిస్తే అనుమతి తప్పనిసరి

ఫంక్షన్ హాళ్లు, రిసార్టుల్లో నిర్వహించే బర్త్‌డే పార్టీలు, ఇతర శుభకార్యాల్లో మద్యం వినియోగిస్తే తప్పనిసరిగా ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమల్‌హాసన్‌రెడ్డి సూచించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'రిసార్ట్‌పై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు' వార్తకు ఆయన స్పందించారు. మేడ్చల్ జిల్లా అంకుషాపూర్‌లోని ది కాంటినెంటల్ రిసార్ట్‌లో సోమవారం అర్ధరాత్రి బిగ్‌బాస్ ఫేమ్ మహబూబ్ ఇచ్చిన బర్త్‌డే పార్టీలో టీవీ నటులు, సెలబ్రిటీలు పాల్గొని అనుమతి లేకుండా మద్యం వినియోగించిన విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.


మేడిబావి శాఖాగ్రౌండ్‌లో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

మేడిబావి శాఖ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్ పనుల పరిశీలన

బౌద్ధనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్, మేడిబావి శాఖగ్రౌండ్‌లో నూతనంగా ఏర్పాటుచేస్తున్న ఓపెన్ జిమ్ పనులపై స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులతో చర్చించారు. బుధవారం మేడిబావి శాఖా గ్రౌండ్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులతో పరిశీలించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులను తొందరగా మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అంతకముందు బ్రాహ్మణబస్తీ జలమండలి అధికారులతో కార్పొరేటర్ పరిశీలించారు. స్థానికంగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతుందని, కలుషితనీటితో పాటు, లోప్రెషర్ వాటర్ వస్తుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. జలమండలి మేనేజర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌స్పెక్టర్ అనుదీప్, అడ్మిన్ ఎస్సై బాలరాజును సత్కరిస్తున్న నాయకులు

ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌కు సత్కారం

బౌద్ధనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయ బోనాలు శాంతియుతంగా జరిగినందుకు ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌ను వివిధ పార్టీ నాయకులు సత్కరించారు. బుధవారం మాజీ కార్పొరేటర్ కందినారాయణ ఆధ్వర్యంలో నాయకులు కుప్ప శ్రీనివాసగౌడ్, వెంకటేశ్, డైమండ్ శ్రీను, మల్లేష్‌యాదవ్, సతీష్, గౌస్ చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ అనుదీప్, అడ్మిన్ ఎస్సై బాలరాజుకు శాలువా కప్పి, పూలదండలు వేసి సన్మానించారు.

దేవాలయం హుండీ డబ్బుల లెక్కింపు

తిరుమలగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని శ్రీ మహాకాళి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం ఈఓ సత్యచంద్రారెడి, మహాకాళి మందిరం అధ్యక్షుడు మురళీ ముదిరాజ్ ఆధ్వర్యంలో హుండీ డబ్బులు లెక్కించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లెక్కింపు కొనసాగింది. హుండీ డబ్బులు లెక్కించగా 2,62,101 రూపాయలు భక్తుల ద్వారా ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఈ డబ్బులను దేవాలయం బ్యాంక్ ఖాతాలో జమచేస్తామని వారు తెలిపారు. గత సంవత్సరం నుంచి ఈ సంవత్సరం వరకు హుండీ ద్వారా ఇంత పెద్ద ఆదాయం రావడం అమ్మవారి చలువ వలనే జరిగిందని అన్నారు. దేవాలయం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహాకాళి మందిరం వర్కింగ్ ప్రెసిడెంట్ భక్తవత్సలం, నిరంజన్, శివకుమార్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలు తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న కమిటీ సభ్యులు.

రైల్వేలో 116 మంది ఉద్యోగ విరమణ

చిలకలగూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 116 మంది బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు పనిచేశారు. సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు ఉద్యోగులకి వీడ్కోలు పలుకుతూ సందడిగా మారాయి. రైల్ నిలయంలో ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ కె.వెంకటరెడ్డి, సీనియర్ సెక్షన్ ఆఫీసర్లు ఎ.జి.కె.మూర్తి, ముస్తాక్ అహ్మద్, లేఖా భవన్‌లో ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ అకౌంట్స్ శ్రీనివాస్, లాలాగూడ వర్క్‌షాపులో విధులు నిర్వహిస్తున్న ఎస్.కె.పి.హజారిలను తోటి ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు శాలువ, జ్ఞాపికలు అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. రిటైరయిన ఉద్యోగులకి వారికి రావలసిన బకాయిలు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి వారికి అందే పెన్షన్ పత్రాలు అందజేశారు.


అడ్డగుట్టలో నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

విద్యార్థుల్లో ప్రతిభ అవసరం

అడ్డగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని సువర్ణ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ సాయిరాచెల్‌లు సూచించారు. గత వారం రోజుల నుంచి పలు ప్రాంతాల్లోకి వెళ్లి పుస్తకాలు పంపిణీ చేయగా చివరి రోజు బుధవారం అడ్డగుట్ట తుకారాంగేట్ పలు ప్రాంతాల్లో బస్తీలోకి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు మేధాశక్తి అవసరమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జ్యోతి, కిషోర్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష చూపొద్దు

●ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పులి కల్పన

అడ్డగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష చూపకూడదని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పులి కల్పన సూచించారు. బుధవారం అడ్డగుట్ట గడ్డమీది బస్తీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమేనని, విద్య ఉపాధి అవకాశాలలో దళితులపట్ల నిర్లక్ష్యం, వివక్ష చూపి అవమానిస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం నేరమన్నారు. ఎస్సీ సంక్షేమ అధికారి భానుప్రియ, రెవెన్యూ అధికారి సర్వేశ్వర్, బస్తీ తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ ఎస్సై దాసరి వెంకటేశ్వర్లు, నాయకులు సుధాకర్, విజయ, రమ, ఉమ పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ని కలిసిన బీజేపీ నాయకుడు మర్రి పురురవరెడ్డి

అడ్డగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ రాజకుమారిని బుధవారం బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవరెడ్డితో పాటు బీజేపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో బీజేపీ నాయకులు గుంటి సత్యనారాయణ, చంద్రపాల్‌రెడ్డి, వికాస్, మంచాల గోపి, స్వామి, పిట్ల శ్రీనివాస్, పరమేశ్, వంశీ ఉన్నారు.



బ్రిగేడియర్ అజిత్ దేశ్‌పాండే పదవీ విరమణ

అల్వాల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఏవోసీ కమాండెంట్ బ్రిగేడియర్ అజిత్ దేశ్‌పాండే భారత సైన్యంలో 34ఏళ్ల పాటు విశిష్ట సేవలు అందించి బుధవారం పదవీ విరమణ చేశారు. ఆగస్టు 25, 1990న ఆర్డినెన్స్ కార్ప్స్‌లో చేరారు. పూంచ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వద్ద మొదట ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆర్మీలో లేహ్, కార్గిల్, సిక్కిం నుంచి రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. ప్రతిష్ఠాత్మకమైన డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ వెల్లింగ్టన్‌లో గ్రాడ్యుయేట్, మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్‌లో ఎంఎస్సీ చేశారు. ఆయన తన సర్వీస్‌లో విభిన్నమైన విభాగల్లో పనిచేశారు. రాణి దుర్గావతి విశ్వవిద్యాలయం నుంచి సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చేశారు. సికింద్రాబాద్ ఏవోసీ కమాండెంట్‌గా బ్రిగేడియర్ అజిత్ దేశ్‌పాండే విశిష్టమైన సేవలను అందించారు. బ్రిగేడియర్ అజిత్ దేశ్‌పాండే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం కింద మొదటి బ్యాచ్ అగ్నివీరులకు శిక్షణను అందించారు. ఆయన ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లలో 3000 మంది అగ్నివీరులకు శిక్షణ అందించారు. 2019 ఆర్టికల్ 370 రద్దు చేసినప్పుడు సవాల్‌గా మారిన శ్రీనగర్‌లో 3 నెలల పాటు మొబైల్, ఇంటర్‌నెట్ కనెక్టివిటీ లేకుండా సవాల్‌గా విధులను నిర్వహించారు. ఆయన పదవీ విరమణ పొందిన తరువాత కూడా సికింద్రాబాద్‌లోనే స్థిరపడనున్నారు. ఆయన పదవీ విరమణ చేయడంతో పలువురు అధికారులు సన్మానించారు.


బ్రిగేడియర్ అజిత్ దేశ్‌పాండే


జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌కు ఎంపికైన సిద్ధార్థ్, శరత్‌నాయర్‌లను అభినందిస్తున్న కోచ్‌లు

జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌కు ఎంపికైన మల్కాజిగిరి విద్యార్థులు

మల్కాజిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌కు మల్కాజిగిరికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో 7వ క్యాడెట్ క్యోరూగి, 41వ జూనియర్ క్యోరూగి రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లు జరిగాయి. చిదాంబ్ తైక్వాండో అకాడమీ 15 మంది సభ్యులతో 7 పతకాలను సాధించింది. సీనియర్ కోచ్ నందకిశోర్ మాస్టర్ ఆధ్వర్యంలో కోచ్ బి.శివశంకర్ సారథ్యంలోని మల్కాజిగిరి గౌతంనగర్‌కు చెందిన విద్యార్థులు సిద్ధార్థ్, శరత్‌నాయర్ బంగారు పతకం సాధించి జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లకు ఎంపికైనట్లు తెలిపారు. నిశాంత్, రవికాంత్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నట్లు వెల్లడించారు.


సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు వెంకటస్వామి, మోహన్

అడ్డగుట్టలో 4న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోనాలు

అడ్డగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మహాకాళి ఆలయం తరువాత అడ్డగుట్ట వడ్డెరబస్తీలోని అత్యంత పేరుగాంచిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆగస్టు 4న బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్తలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండుగుల వెంకటస్వామి మోహన్ తెలిపారు. బుధవారం అడ్డగుట్టలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వీరు మాట్లాడుతూ ఆగస్టు 4న జరిగే బోనాలు ఉత్సవాలకు తాము ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి ఆహ్వానపత్రికను అందజేశామన్నారు. తన తండ్రి సాయిలు ఆలయ నిర్మాణకర్తగా ప్రతిఏటా నిర్వహించే బోనాలు ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బోనాలకు ముందు రోజు నుంచి రెండు రోజులపాటు విజయవాడ కేరళ, తమిళనాడు ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను పూర్తిచేశామన్నారు. చివరి రోజున అమ్మవారి ఊరేగింపులో వేలమంది భక్తులు పాల్గొంటారని, అడ్డగుట్ట నుంచి తుకారాంగేట్, పలు కూడళ్ల మీదుగా తిరిగి ఆలయానికి అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. ప్రతి ఏటా తుకారాంగేట్ పోలీసుల సహకారంతో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. జాతరకు వివిధ పార్టీల మంత్రులు, ఎమ్మెల్యేలు విచ్చేసి అమ్మవారి ఆశీర్వాదం తీసుకుంటున్నారన్నారు.

ప్రతి పాయింట్‌లో కంట్రోలర్

● సికింద్రాబాద్ రీజియన్‌లో రోజూ 11లక్షలమంది ప్రయాణికులు
● ఆర్థిక సంవత్సరం నాటికి 289 ఎలక్ట్రిక్ బస్సులు
● సికింద్రాబాద్ రీజియన్ రీజనల్ మేనేజర్ ఖుస్రో షాఖాన్

మారేడ్‌పల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ప్రతి పాయింట్‌లో కంట్రోలర్ నియమిస్తున్నామని సికింద్రాబాద్ రీజియన్ రీజనల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్ తెలిపారు. జూబ్లీబస్టాండ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ రీజన్‌కి 400 బస్సులు కేటాయించగా, 111 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులో వచ్చాయన్నారు. ఆర్థిక సంవత్సరం పూర్తినాటికి 289 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సికింద్రాబాద్ రీజియన్‌లో మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు 5.5లక్షల మంది ప్రయాణాలు సాగిస్తే, నేడు రోజూ 11 లక్షల మంది ప్రయాణాలు సాగిస్తున్నారన్నారు. మహాలక్ష్మి పథకంలో సికింద్రాబాద్ రీజియన్‌లో 6.5 లక్షల మంది ప్రయాణాలు పెరిగాయన్నారు. రోడ్డు భద్రత విభాగంలో సికింద్రాబాద్ రీజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. డ్రైవర్లు రోడ్డు మధ్యలో బస్సు ఆపకుండా బస్ బేలో బస్సులు ఆపే విధంగా ప్రతి పాయింట్‌లో కంట్రోలర్ నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో ప్రతి డిపోలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులు అవసరాల నిమిత్తం రాబోయే రోజుల్లో 65 మెట్రో డీలక్స్ బస్సులు, 140 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు, 60- సిటీ ఆర్డినరీ బస్సులు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.


సికింద్రాబాద్ రీజియన్ రీజనల్ మేనేజర్ ఖుస్రో షాఖాన్


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆందోళన చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

ఇతర రాష్ట్రాల క్యాబ్‌లను అనుమతించొద్దు

● శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రెండోరోజూ కొనసాగిన ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లకు అనుమతించొద్దని డిమాండ్ చేస్తూ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్యాబ్‌డ్రైవర్లు చేపట్టిన ఆందోళన బుధవారం రెండోరోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా క్యాబ్ డ్రైవర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొందరు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి క్యాబ్‌లను తీసుకొచ్చి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నడిపించి తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని, తాము రోడ్డున పడే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇంతకుముందు జీఎంఆర్ అధికారులుకు, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లను ఎయిర్‌పోర్టులోకి అనుమతిని రద్దుచేసే వరకు పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోతే ముందుందు ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.


హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రిటైరయిన ఉద్యోగులను సన్మానిస్తున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

రిటైర్డ్ పోలీసు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ పొందిన 36మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి బుధవారం సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం పోలీసు శాఖ నుంచి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, పోలీస్ శాఖ తరఫున మీకు, మీ కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ అడ్మిన్ జె.పరిమళ హనా నూతన్, చీఫ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాస్, ఏడీఓ శ్రీదేవి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్‌రెడ్డితోపాటు పలువురు పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో బుధవారం పదవీ విరమణ పొందిన 8 మంది ఉద్యోగులను జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఘనంగా సన్మానించారు.


సస్టెయిన్ ఫెస్ట్ విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభిస్తున్న నిపుణురాలు చారుధ్యాని, కరస్పాండెంట్ ఆల్ఫోన్‌రెడ్డి

సెయింట్ పీటర్ స్కూలులో విజ్ఞాన ప్రదర్శన

బోయినపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి సీతారాంపురంలో సెయింట్‌పీటర్స్ హైస్కూల్‌లో సస్టెయిన్ ఫెస్ట్ పేరిట పర్యావరణం, వ్యవసాయం, కమ్యూనికేషన్లపై స్థిరత్వం, ఆవిష్కరణలు ప్రధాన అంశాలుగా విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిపుణురాలు చారుధ్యాని, కరస్పాండెంట్ ఆల్ఫోన్‌రెడ్డి, సెయింట్ పీటర్ పాఠశాల చైర్మన్ టీపీ రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 6,7,8 తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, రోబోటిక్స్, ఇంజనీరింగ్ ఆర్ట్స్, గణితం, తదితర ప్రధాన అంశాలు ఆరోగ్యం, లైఫ్‌స్టైల్, పర్యావరణం, వ్యవసాయం, కమ్యూనికేషన్ రవాణ తదితర ఉప అంశాలపై తయారుచేసిన నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు తమ మేథోశక్తితో తయారుచేసిన నమూనాలు అందరినీ ఆలోచింపజేసే విధంగా ఆకట్టుకున్నాయని చారుధ్యాని అన్నారు. కాగా తమ విద్యార్థులు పర్యావరణ సవాళ్లను ఎదుర్కొనే విషయమై చేసిన ఆవిష్కరణ సందర్శకులను ఆకట్టుకున్నాయని చైర్మన్ టీపీ రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఓయూలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు

ఓయూలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

తార్నాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీలో కించపరిచేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను ఓయూ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ సబితా ఇంద్రారెడ్డి పట్ల రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు పిగా వెంకట్ గౌడ్, జంగయ్య, నాగేందర్, అవినాష్, శ్రీకాంత్, రామకృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌డ్రైవర్ ఆత్మహత్య

అల్వాల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధలు తాళలేక ఓ స్కూల్‌డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ అంబిక తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా, దౌల్తాబాద్ మండల, దొమ్మాట గ్రామానికి చెందిన కనుగుల స్వామి అలియాస్ మల్లయ్య(30) జీవనోపాధి కోసం ఐదేళ్ల క్రితం అల్వాల్‌కు వచ్చి ఓల్డ్ అల్వాల్ అంజనాపురి కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తూ స్కూల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్వామికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పులు ఎక్కువ కావడంతో వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేటు నెంబరు 5లో బుధవారం గుర్తుతెలియని 60ఏళ్ల వృద్ధుడు ప్లాట్‌ఫాంపై చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులను ఆశ్రయించాలని కోరారు.


వృద్ధుడి మృతదేహం

3 నుంచి హైదరాబాద్‌లో సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : హిందుస్తానీ కళలు, సంస్కృతి, సాహిత్యాన్ని వేడుక చేసే అతిపెద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో ఒకటైన సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ మొదటిసారిగా హైదరాబాద్‌లో జరగనుంది. ఈ కార్యక్రమం ఆగస్టు 3, 4 తేదీల్లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ)లో జరగనుంది. ఈ సాంస్కృతికోత్సవాల విశేషాల గురించి జష్న్-ఏ-ఆదాబ్ వ్యవస్థాపకుడు కున్వర్ రంజీత్ చౌహాన్ మాట్లాడుతూ 'పలు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం అద్భుత విజయం సాధించిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చింది. ఈ సాంస్కృతికోత్సవంలో దక్కనీ ఉర్దూపై పర్షియన్ ప్రభావంపై చర్చతో పాటుగా డాక్టర్ విద్యా షా గజల్స్, వార్సీ బ్రదర్స్ ఖవ్వాలి, యామినీరెడ్డి నృత్యప్రదర్శన, ఉర్దూలో శ్రీమద్ భగవద్గీత పఠనం వంటివి ఉంటాయి. దేశవ్యాప్తంగా సుప్రసిద్ధ కవులు, గాయకులు, కళాకారులు పాల్గొనన్నున్న ఈ కార్యక్రమంలో సాహిత్య, కళాభిమానులు పాల్గొనవచ్చు' అని తెలిపారు.


సాహిత్యోత్సవ్